
# అందరూ పండితులే



*గతే రామే గతే సోమే*
*గతే కుండల పండితే*
*అహో పేరూరు దౌర్భాగ్యం*
*వ్యాఖ్యాతా సూప శంకరః*

*భావం:* రాముడూ, సోముడూ, కుండల పండితుడూ గతించాక వంటవాడైన శంకరుడే వ్యాఖ్యాత అయ్యే దౌర్భాగ్యం పేరూరికి పట్టింది కదా.

పూర్వకాలంలో విద్యాభ్యాసానికి అవకాశాలు చాలా తక్కువ. అచ్చు పుస్తకాలు లేని ఆరోజుల్లో పుస్తక ప్రతుల సంఖ్య తక్కువగా ఉండేది. చదువనేది

అర్హులకి మాత్రమే చెప్పాలన్న నమ్మకం కూడా ఉండేది. విద్యను స్వార్థప్రయోజనాలకి దుర్వినియోగ పరుస్తారన్న అనుమానం కలిగితే గురువులు శిష్యులుగా చేర్చుకునేవారు కాదు. దేనివల్లనైనా మేలూ కీడూ కూడా జరుగుతాయి. ప్రాచీన భారతంలో శాస్త్ర విజ్ఞానం ఎంత గానో వృద్ధి చెందినా ఈనాడు ఆ గ్రంథాలు ఎక్కువగా లభించడం లేదు. విద్య రహస్యంగా ఉంచి తక్కువ మందికి బోధించడమే ముఖ్య కారణమని కొందరంటారు.

ఈ విధంగా తక్కువ మందికే విద్యావకాశాలున్న రోజులలో పేరూరు అని ఊళ్ళో రామశాస్త్రి, సోమావధాన్లు, కుండల పండితుడు అని ముగ్గురే వేదాలూ, ధర్మశాస్త్రాలూ చదివిన వారుండేవారు. కాలక్రమేణా ముగ్గురూ కాలధర్మం చెందారు. ఊళ్ళో ఎవరికి ధర్మసందేహం కలిగినా చెప్పేవారు లేరు.

ఆ పరిస్థితిలో ఒకరింట్లో తండ్రి ఆబ్దికం వచ్చింది. ముగ్గురు కొడుకులూ తద్దినం పెడుతున్నారు. ఇంటి పెద్దకోడలు నిప్పు పట్టికెళ్ళి ఇవ్వాలి. పెద్దకొడుక్కి ఇద్దరు భార్యలు పెద్దామె రజస్వలగా ఉంది. ఇప్పుడునిప్పు ఎవరు పట్టుకెళ్ళాలి? పెద్దకొడుకు రెండవ భార్య తనదే హక్కు అంది. నేను వయస్సులో పెద్దదాన్ని నేనే తీసికెడతానని రెండవ కొడుకు భార్య అంది. తద్దినం పెట్టేవాడి వెనకాల తమ్ముడంటారు నీకేం హక్కు అని మూడోవాడి భార్య అంది. వంటింట్లో గొడవైంది. “అయ్యో కనుక్కుందుకు పండితుల్లేరు కదా” అని అత్తగారు అంది. ఇంట్లో తద్దినం వంట చెయ్యడానికి వచ్చిన శంకరయ్య “ ఈ మాత్రానికి పండితులెందుకమ్మా నేను చెప్తాను. రెండో కొడుకు భార్య తీసికెళ్ళడం న్యాయం” అన్నాడు. ఆవిడ అతనికి పప్పూ ఉప్పూ సాయం చేస్తూ ఉంటుంది. అందుకే ఆమె పక్షం వహించాడు. తన మాట నిజమే అనడానికి ఏదో తనకొచ్చిన శ్లోకం చదివాడు. స్త్రీలకి విద్యావకాశాలు లేని ఆ రోజుల్లో శంకరయ్య చెప్పింది నిజమేనని అందరూ అనుకున్నారు. అతనికి ధర్మశాస్త్రాలలో పాండిత్యం ఉందని పేరు వచ్చేసింది. అందరూ అతన్ని సంప్రదించసాగారు.

కొన్నాళ్ళకి కాశీలో విద్యాభ్యాసం పూర్తిచేసుకుని వెంకటశర్మ అనే యువకుడు గ్రామానికి తిరిగి వచ్చాడు. వచ్చిన మూడవ రోజునే తండ్రిగారి ఆబ్దికం. ఇంట్లో ప్రయత్నాలు లేవు. "అన్నయ్యా భోక్తలకి చెప్పావా" అని అన్నగారిని అడిగాడు. అన్నగారు "ఈఏడు కూతురి పెళ్ళిచేశాను కదా. తద్దినం పెట్టకూడదట. శంకరం చెప్పాడు" అన్నాడు. వెంకటశర్మ నిట్టూర్చాడు. పెళ్ళిచేసిన వారు వేరే ఇళ్ళల్లో కర్మలలో పాల్గొనకూడదు కానీ ఇంట్లో తల్లిదండ్రుల ఆబ్దికాలు మానరాదే. తనేమైనా చెప్పినా చిన్నవాడివి నీకేం తెలుసునంటారు. వెంకటశర్మ దుఃఖంతో పెద్ద పండితులంతా పోయాక వంటలు చేసే శంకరుడు శాస్త్ర వ్యాఖ్యాత అయ్యే దౌర్భాగ్యం పేరూరికి పట్టింది కదా" అనుకున్నాడు.

ఈనాడు ఆనాడున్న పరిస్థితిలేదు. విద్యావకాశాలు చాలా మెరుగయ్యాయి. అయితేనేం మంది ఎక్కువైతే మజ్జిగ పల్చన అన్నట్లుగా ప్రతి ఒక్కరూ శాస్త్రవ్యాఖ్యాతలూ, సనాతన ధర్మ పరిరక్షకులూ, సంప్రదాయంపై ఉపన్యసించేవారూ అయిపోతున్నారు. నిజమైన శాస్త్ర పండితుల సంఖ్య ఆనాడూ తక్కువే, ఈనాడూ తక్కువే. ఏ దౌర్భాగ్యం మేలు?

******